'ప్రజావాణి' ఫిర్యాదులను
సత్వరమే పరిష్కరించాలి
- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్
- బాధితుల నుంచి 24 అర్జీలు

7లో

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

- పదో తరగతి ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి
- అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 8 : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచాలని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ఎంఈవో, ఎంఎన్‌వో, సీహెచ్ఎస్, ఉపాధ్యాయులతో సోమవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే మూడు నెలలు ఉపాధ్యాయులు సెలవు తీసుకోకుండా పనిచేయాలని సూచించారు. టూర్ డైరీని తయారు చేసుకుని నివేదిక సమర్పించాలని ఆదేశించారు. తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ సంబంధిత పోర్టల్‌లో ప్రతీరోజు ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి, లక్ష్య యాప్‌లో వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. యాప్‌లో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఎదురైనా డీఈవో దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈసారి పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీపీగా డాక్టర్ బి.అనురాధ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ బి.అనురాధ

సిద్దిపేట క్రైం, జనవరి 8 : సిద్దిపేట నూతన పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో సైబర్ క్రైమ్ డీసీపీగా పనిచేస్తున్న అనురాధ మూడు రోజుల క్రితం సిద్దిపేట పోలీస్ కమిషనర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ మేరకు సీపీగా బాధ్యతలు స్వీకరించి ముందుగా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీలు అందె శ్రీనివాసరావు, ఎస్.మల్లారెడ్డి, ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామచంద్రరావు, సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ సురేందర్‌రెడ్డి, గజ్వేల్ ఏసీపీ రమేష్, హుస్నాబాద్ ఏసీపీ సతీష్, ఎస్బీ ఏసీపీ రవీందర్‌రాజు, ట్రాఫిక్ ఏసీపీ ప్రసన్నకుమార్, సీఐలు, ఎస్ఐలు, ఏవో యాదమ్మ కమిషనర్ కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీలు, ఏసీపీలతో సమీక్ష నిర్వహించి జిల్లా భౌగోళిక పరిస్థితులు ఏ తరహా నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయి, తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. సీపీ జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె.పాటిల్‌ని కలిసి మొక్కను అందజేశారు. సిద్దిపేట ప్రధాన న్యాయాధికారి రఘురామ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

సవాలుగా సైబర్ నేరాలు

జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలు సీపీ డాక్టర్ బి.అనురాధకు సవాల్‌గా మారనున్నాయి. గతంలో ఆమె రాచకొండ పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైమ్ డీసీపీగా విధులు నిర్వహించారు. ఆన్‌లైన్ మోసాలను ఏవిధంగా అరికట్టాలి, ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే విషయాల పట్ల పూర్తి అవగాహన ఉన్నట్లు సమాచారం. అయితే జిల్లాలో రెండు సంవత్సరాల్లో సైబర్ క్రైమ్ కేసులు ఎక్కువగా జరిగాయి. గత సీపీ శ్వేత జిల్లాలో సైబర్ నేరాల నివారించడానికి ప్రత్యేక టీమును ఏర్పాటు చేసింది. గ్రామాల్లో, పట్టణాల్లో వారానికి మూడు రోజులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గతేడాది జిల్లాలో 234 సైబర్ క్రైమ్ కేసులు నమోదు కాగా 148 కేసుల్లో రూ.1,04,03,871 నగదును ఫ్రీజ్ చేశారు. ప్రస్తుతం జిల్లాలో రోజు ఎక్కడో ఒకచోట ఆన్‌లైన్ మోసం జరుగుతూనే ఉంది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ నుంచి వచ్చిన నూతన సీపీ ఈ నేరాలను తన అనుభవంతో ఏవిధంగా అరికడుతుందో వేచి చూడాలి. ఇక పాత సీపీ శ్వేత జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ సెంటర్లలో షీ టీమ్ బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి విద్యార్థినులకు, ఉద్యోగం చేసే మహిళలకు రక్షణ కల్పించింది. ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్, భరోసా సెంటర్, సఖీ సెంటర్‌లలో సమీక్ష సమావేశాలు నిర్వహించి జిల్లాలో జరుగుతున్న మహిళలపై అఘాయిత్యాలను, అన్యాయాలను, తగ్గించేందుకు చర్యలు తీసుకున్నది. ప్రస్తుతం నూతనంగా వచ్చిన సీపీ కూడా మహిళా కావడంతో అదే తరహాలో చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 2022లో 27 గంజాయి కేసులు, 2023లో 14 గంజాయి కేసులు నమోదయ్యాయి. జిల్లాల్లో గంజాయి, మత్తు పదార్థాల రవాణాను పూర్తిగా నిర్మూలించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో కొత్త సీపీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.



గజ్వేల్ పట్టణంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లు

పాత వారికేనా.. మళ్లీ ఎంపికా?

డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో అనర్హులకు ఇళ్లు దక్కాయంటూ పలువురు రోడ్డెక్కడంతో పాటు మరికొంత మంది బహిరంగంగా ఆరోపణలు చేశారు. అర్హులకు అన్యాయం జరిగిందని, ఇళ్లు, ప్లాట్లు, భూములు ఉన్న వారికి కేటాయించారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో డబుల్ బెడ్‌రూం సాధన కమిటీ పేరుతో పలువురు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసుకుని మునిసిపల్, తహసీల్దారు, ఆర్డీవో, కలెక్టరేట్, ప్రజాభవన్‌లో సైతం ఫిర్యాదు చేశారు. గతంలో ఇచ్చిన గృహలక్ష్మి ఇళ్లను కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిన నేపథ్యంలో గతంలో ఎంపిక చేసిన లబ్ధిదారులనే కొనసాగిస్తారా లేక మరోసారి ఎంపిక చేస్తారా అన్న మీమాంస వ్యక్తమవుతుంది.

వాళ్లు వెళ్లరు.. వీళ్లకు దక్కవు!

- విచిత్రంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల పరిస్థితి
- గతంలో ఎంపికైన వారిలో అనర్హులంటూ ధర్నాలు
- ఎటూ తేల్చని అధికార యంత్రాంగం
- తాత్కాలిక నివాసం ఉంటున్న మల్లన్నసాగర్ భూనిర్వాసితులు
- డబుల్ లబ్ధిదారులకు ఇబ్బందులు

గజ్వేల్, జనవరి 8: డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ఉన్న వాళ్లు బయటకు వెళ్లరు. సొంతింటి కలను నెరవేర్చుకోవడానికి ఎదురుచూస్తున్న వాళ్లకు ఇళ్లు దక్కవు అన్నట్లుగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిస్థితి తయారైంది. లబ్ధిదారులు ఎంపికై దాదాపుగా పది నెలలు కావస్తున్నా ఇప్పటివరకు అందరికీ ఇళ్లు అందలేదు.

1100 మంది లబ్ధిదారుల ఎంపిక

మునిసిపాలిటీ పరిధిలోని రూ.100 కోట్ల వ్యయంతో 1,250 ఇళ్లను సంగాపూర్ రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 68లో 158 బ్లాకులలో జీప్లస్‌వన్ పద్ధతిన నిర్మించారు. నిర్మించి దాదాపు నాలుగేళ్లు అవుతున్నా లబ్ధిదారులకు దక్కలేదు. అటు మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో ఇళ్లు, ఆస్తి కోల్పోయిన వారికి గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలో నిరుపేదల కోసం నిర్మించిన ఇళ్లలో తాత్కాలిక నివాసం ఉంచారు. ఈ ఇళ్లను గతేడాది మార్చిలో 1100 మంది గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌కు చెందిన నిరుపేదలకు కేటాయించారు. మునిసిపాలిటీ పరిధిలో వారం రోజుల పాటు దరఖాస్తులను స్వీకరించగా 3,512 దరఖాస్తులు వచ్చాయి. వాటిని వడపోయగా 1,550 మందిని ఎంపిక చేశారు. వీరిలో లక్కీ డ్రా పద్ధతిన అందరి సమక్షంలోనే 1100 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. కానీ దాదాపుగా పది నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు లబ్ధిదారులకు అందలేదు. మిగిలిన 150 రోడ్డు విస్తరణలో ఇళ్లను కోల్పోయిన వారికి, అనాథ పిల్లలకు కేటాయించారు.

కొంతమంది లబ్ధిదారులు ఇళ్లలోకి

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులను మార్చి 21న మహతి ఆడిటోరియంలో ఎంపిక చేశారు. లబ్ధిదారులుగా తేలిన వారు డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ఉన్న మల్లన్నసాగర్ భూనిర్వాసితులతో మాట్లాడుకుని వారు ఖాళీ చేసి సొంత ఇళ్లకు వెళ్లిపోగానే వీరు వెళ్లి సెటిల్ అవుతున్నారు. ఈ క్రమంలో మరి కొంత మంది లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు సొంతిళ్లకు వెళ్లిపోతుంటే తమ ఇళ్లను మల్లన్నసాగర్ బాధితులు ఖాళీ చేయకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. ఈక్రమంలో అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ నాయకులు అనర్హులకు ఇళ్లు దక్కాయని, ఎంపిక చేసిన వారిలో అనర్హులుంటే తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం, జిల్లా అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

నిర్వాసితులు ఖాళీ చేస్తేనే..!

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో నిర్మించిన 1,250 ఇళ్లలో మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణంలో భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులు తాత్కాలిక నివాసం ఉంటున్నారు. ఇళ్లు తీసుకోకుండా ప్లాట్ తీసుకుని నిర్మించుకునే వారు తలదాచుకునేందుకు ఈ ఇళ్లను గతంలో అధికారులు కేటాయించారు. వీరిలో కొంతమంది ఇక్కడ వారి సామగ్రిని వేసి సిద్దిపేట, హైదరాబాద్‌లలో ఉంటుంటే, మిగిలిన వారు ఇళ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే వెళ్లిపోతున్నారు. మరికొందరికి ప్యాకేజీ, ఇళ్లు, పరిహారం పూర్తి స్థాయిలో దక్కకపోవడంతో వారు డబుల్ బెడ్‌రూం ఇళ్లలోనే ఉంటున్నారు. వారి కారణంగా లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పట్లో అందడం గగనంగానే కనిపిస్తుంది.

కొమురవెల్లి భక్తిపారవశ్యం

- మార్మోగిన రుద్రనామస్మరణ
- మల్లన్నకు కన్నులపండువగా లక్షబిల్వార్చన
- భక్తిప్రపత్తులతో ఏకాదశ రుద్రాభిషేకం
- కొనసాగుతున్న భక్తుల రద్దీ
- బుకింగ్ ఆదాయం రూ.22 లక్షలు



బిల్వాలతో మల్లన్న

చేర్యాల, జనవరి 8 : కొమురవెల్లి మల్లన్న ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వైభవంగా లక్షబిల్వార్చన, ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఆదివారం ఆలయ తోటబావి ఆవరణలో నిర్వహించిన స్వామివారి కల్యాణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన విషయం విదితమే. ఉత్సవాలలో భాగంగా రెండో రోజున మల్లన్నకు సుప్రభాతసేవ, గణపతి పూజ, శివపుణ్యహవాచనం, నాందిసమారాధ, గురుపంచ కలశస్థాపన, నవగ్రహ ఏకాదశరుద్ర సప్తమాతృకత్రిమూర్తి, త్రిమాత, అష్టదిక్పాలక నిత్యార్చన, ప్రధాన కలశస్థాపన, ఆవాహన అర్చనను నిర్వహించారు. ఈ సందర్భంగా వీరశైవరుత్విక్కులు స్వామివారికి శాస్త్రోక్తంగా బిల్వార్చన జరిపారు. భక్తిప్రపత్తులతో ఏకాదశ రుద్రాభిషేకం పూజలు చేశారు. వీరశైవాగమ వేదపాఠశాల విద్యార్థులు మల్లన్నను స్తుతిస్తూ చేసిన మంత్రోచ్చారణలతో ఆలయ పరిసరాలు ప్రతిధ్వనించాయి. మల్లన్నను దర్శించుకునే భక్తుల రద్దీ కొనసాగుతుంది. కార్యక్రమంలో ఆలయ ఈవో బాలాజీశర్మ, ఏఈవోలు వైరాగ్యం అంజయ్య, గంగ శ్రీనివాస్, సూపరింటెండెంట్ నీల శేఖర్, స్థానాచార్యుడు పడిగన్నగారి మల్లయ్య, ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, అర్చక సంఘం అధ్యక్షుడు పడిగన్నగారి ఆంజనేయులు, అర్చకులు పడిగన్నగారి మల్లికార్జున్, మహదేవుని సాంబయ్య, ఆకుల విజయ్‌కుమార్, మహదేవుని మనోహర్, మహదేవుని రవి, మహదేవుని భాస్కర్, ఉద్యోగులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న వీరశైవార్చకులు

రూ.9 లక్షలు మేర పెరిగిన ఆదాయం

మల్లన్న కల్యాణం సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకున్న క్రమంలో సుమారు రూ.22 లక్షల మేర బుకింగ్ ఆదాయం సమకూరినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. తలనీలాల సమర్పణ, ఆర్జితసేవలు, పట్నాలు, బోనాలు, ప్రత్యేక దర్శనాలు, వసతి గదుల అద్దె, ప్రసాద విక్రయాల ద్వారా శనివారం రోజున రూ.1.50 లక్షలు, ఆదివారం రోజున రూ.18.70 లక్షలు, సోమవారం సుమారు రూ.2 లక్షలు చొప్పున మొత్తం రూ.22 లక్షల మేర బుకింగ్ ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు. గతేడాది మూడు రోజుల్లో రూ.13లక్షల బుకింగ్ ఆదాయం సమకూరగా, ఈఏడాది రూ.9లక్షలు మేర ఆదాయం పెరిగింది.

నూతన ఉత్సవ మూర్తులకు సంప్రోక్షణ

ఆర్జిత సేవలు, పూజల నిర్వహణతో పాటు అలంకరణకు వీలుగా ఆలయ వర్గాలు ఇటీవల మల్లన్న, కేతలమ్మ, మేడలాదేవీ పంచలోహ నూతన ఉత్సవమూర్తులను తయారు చేయించారు. కల్యాణం సందర్భంగా ఆదివారం సంప్రోక్షణ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

అభివృద్ధి పనుల రద్దు సరికాదు

గత ప్రభుత్వం మంజూరు చేసిన వాటిని కొనసాగించాలి

- సంగారెడ్డి జడ్పీ మీటింగ్‌లో సభ్యుల డిమాండ్
- పనులను రద్దు చేయడంపై ఆగ్రహం
- తొమ్మిది శాఖలపై చర్చతోనే సరి

సంగారెడ్డి టౌన్, జనవరి 8 : సంగారెడ్డి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం వాడీవేడిగా జరిగింది. గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను నిలిపివేయాలంటూ ప్రస్తుత ప్రభుత్వం ఆదేశాలివ్వడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ ఉల్లంఘనతో పాటు సీఎస్ఆర్ నిధులపై చర్చ జరిగింది. సంగారెడ్డిలోని జడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ మంజుశ్రీ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, సునీతారెడ్డి, సంజీవరెడ్డి, ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన జడ్పీ సమావేశం పలువురు ప్రజాప్రతినిధులు సకాలంలో రాకపోవడంతో గంట ఆలస్యంగా ప్రారంభమైంది. ఎజెండాలో మొత్తం 54 అంశాలను పొందుపర్చగా కేవలం తొమ్మిది శాఖలపై మాత్రమే చర్చ జరిగింది.

సీఎస్ఆర్ నిధులపై సభ్యుల వాగ్వాదం

జిల్లాలోని పలు పరిశ్రమల ద్వారా వచ్చే సీఎస్ఆర్ నిధుల కేటాయింపుపై కాంగ్రెస్, బీఆర్ఎస్ జడ్పీటీల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. కొండాపూర్ మండలంలోని పలు బీరు కంపెనీల నుంచి సీఎస్ఆర్ నిధులను గత పాలకులు సిద్దిపేట, సిరిసిల్ల ప్రాంతాలకు తరలించారని కొండాపూర్ ఎంపీపీ మనోజ్‌రెడ్డి ఆరోపించారు. దీనిపై జడ్పీ వైస్‌చైర్మన్ కుంచాల ప్రభాకర్, ఎంపీపీ సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ప్రశ్నించకుండా.. ఇప్పుడు పార్టీ మారగానే విమర్శించడం ఏమిటని ఎదురుదాడికి దిగారు. అనంతరం కోహీర్ జడ్పీటీసీ రాందాస్ మాట్లాడుతూ తమ మండలంలోని పిరమిడ్ పరిశ్రమ యాజమాన్యం జిల్లా కలెక్టర్ ఆదేశాలను ఖాతరు చేయకుండా సీఎస్ఆర్ నిధులను ఇష్టానుసారంగా ఖర్చు చేసిందని ఫిర్యాదు చేశారు.

ప్రొటోకాల్ ఉల్లంఘన సరికాదు

గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులను నిలిపివేయాలని ఆదేశాలివ్వడం సరికాదని ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణికర్‌రావు, సునీతారెడ్డిలతో పాటు పలువురు జడ్పీటీసీలు మండిపడ్డారు. సంగారెడ్డి జిల్లాను సస్యశ్యామలంగా మార్చేందుకు రూ.4,500 కోట్లతో గత ప్రభుత్వం ప్రారంభించిన సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను నిలిపివేస్తే రైతులకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన ఎస్‌డీఎఫ్, పంచాయితీరాజ్, ఎన్ఆర్ఈజీఎస్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ తదితర పనులను రద్దు చేయకుండా కొనసాగించాలని జడ్పీటీసీలు ఏకగ్రీవంగా తీర్మానించారు. జహీరాబాద్‌లోని ట్రైడెంట్ షుగర్ పరిశ్రమ నుంచి చెరకు రైతులకు రావాల్సిన రూ.7.35 కోట్ల బకాయిలను వెంటనే ఇప్పించాలని స్థానిక ఎమ్మెల్యే మాణిక్‌రావు కలెక్టర్‌ను కోరారు. అలాగే, కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతున్నదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు.



జడ్పీ సమావేశానికి హాజరైన చైర్‌పర్సన్ మంజుశ్రీ, ఎమ్మెల్యేలు సునితారెడ్డి, సంజీవరెడ్డి, ఎంపీ బీబీపాటిల్, కలెక్టర్ వల్లూరు క్రాంతి

కర్ణాటక కాంట్రాక్టర్లతో రోడ్ల పనులు

నాగల్‌గిద్ద రోడ్డు మరమ్మతులు ఎందుకు చేయడం లేదని జడ్పీటీసీ రాజురాథోడ్ సంబంధిత శాఖ అధికారులను ప్రశ్నించారు. ఆర్అండ్‌బీ ఈఈ రాంబాబు స్పందిస్తూ జిల్లాలో చేపట్టిన ఆర్అండ్‌బీ పనులను చేసేందుకు తెలంగాణ కాంట్రాక్టర్లు ముందుకురాకపోవడంతో కర్ణాటకకు చెందిన కాంట్రాక్టర్లను పిలిపించి పనులు చేయించాల్సి వస్తున్నదని తెలపడంతో సభ్యులు, ఎమ్మెల్యేలు, అధికారులు నిర్ఘాంతపోయారు. ఆయా పనులకు సంబంధించి అనేక సార్లు టెండర్లు పిలిచినా ఈ ప్రాంత కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రాయికోడ్, మునిపల్లి, తదితర మండలాల్లో రోడ్లు, కల్వర్టుల నిర్మాణం పనులను సైతం కర్ణాటక కాంట్రాక్టర్ల చేత పనులు చేయిస్తున్నామన్నారు. కొండాపూర్ మండలంలోని మల్కాపూర్ పెద్ద చెరువు మరమ్మతు కోసం రూ.7 కోట్లు మంజూరైనా ఇప్పటివరకు కనీసం అగ్రిమెంట్ కూడా చేయకపోవడం ఏమిటని ఎంపీపీ మనోజ్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. అందోలు మండలం అక్సాన్‌పల్లి చెరువు, మొల్గొనికుంట కట్టలు బీటలువారి ప్రమాదకరంగా మారినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని అందోలు జడ్పీటీసీ రమేశ్ ఆరోపించారు.



అధికారిక నివాసమైన క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

క్యాంపు కార్యాలయంలోకి మంత్రి పొన్నం ప్రవేశం

- కుటుంబసభ్యులతో కలిసి పూజలు

హుస్నాబాద్, జనవరి 8 : హుస్నాబాద్ పట్టణంలోని హన్మకొండ రోడ్డు వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ఉదయం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రవేశించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులతో కలిసి క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇన్ని రోజులు అద్దె భవనంలో ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ ఇక నుంచి క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు. అనంతరం కార్యకర్తలతో సమావేశమయ్యారు. నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, జడ్పీటీసీ గీకురు రవీందర్, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ వీరన్ననాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వెన్న రాజు, సరోజన, మండలాల అధ్యక్షులు బంక చందు, జంగపల్లి అయిలయ్య, వివి రమణ, వెన్న రాజు తదితరులు పాల్గొన్నారు.



తల్లి, భార్య సమక్షంలో క్యాంపు ఆఫీసులో కుర్చీలో ఆసీనులైన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

యాసంగి వరి సాగుకు సింగూరు జలాల విడుదల



సింగూరు ఎడమ కాల్వలోకి వదిలిన జలాలు

- ప్రస్తుతం 29.917 టీఎంసీలకు 24.954 నిల్వ
- రోజుకు 150 క్యూసెక్కులు.. సీజన్ పూర్తయ్యే వరకు...

పుల్‌కల్, జనవరి 8: సింగూరు ప్రాజెక్టు ఆయకట్టు పరిరక్షణకు పుల్కల్, అందోలు మండలాల పరిధిలో యాసంగి సీజన్ వరి పంట సాగుకు నీటి పారుదల శాఖ అధికారులు సోమవారం జలాలను విడుదల చేశారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సీ.దామోదర్ రాజనర్సింహ ఆదేశాలమేరకు నీటిని విడుదల చేసినట్లు ప్రాజెక్టు జేఈఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. రోజుకు 150 క్యూసెక్కుల చొప్పున యాసంగి సీజన్ వరి నాట్లు అనంతరం పంట కోతకు వచ్చేంత వరకు సింగూరు జలాలను విడుదల కొనసాగుతుందన్నారు. నాలుగు నెలల పాటు మొత్తం 2 టీఎంసీల సింగూరు జలాలు ఎడమ ప్రధాన కాల్వ తూముల గుండా నీటిని విడుదల చేస్తామన్నారు. ప్రాజెక్టులో ఆశించినస్థాయిలో జలాలు అందుబాటులో ఉన్నాయని, ఎత్తిపోతలతో సంబంధం లేకుండానే కేవలం గ్రావిటీ ద్వారా నీటి విడుదల ఉంటుందన్నారు. ప్రాజెక్టులో సోమవారం నాటికి నీటి నిల్వలు 24 టీఎంసీలు ఉన్నాయి. హైదరాబాద్ మహానగర మంచినీటి సరఫరాకు 80 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు, 220 క్యూసెక్కులు ఆవిరి అవుతున్నాయి. తాగు, సాగు నీటికి ఎలాంటి ఢోకా లేదని, ప్రస్తుతం ప్రాజెక్టులో సమృద్ధిగా జల వనరులు అందుబాటులో ఉన్నాయని ప్రాజెక్టు జేఈఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. రైతులు వరి నాట్లు వేసుకునేందుకు సిద్ధమవుతున్న సమయంలో సింగూరు జలాలను విడుదల చేయడంపై పుల్కల్, చౌటకూర్ మండలాల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఆయా మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు ఎందుర్గారెడ్డి, నత్తి దశరథ్ మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యార్థిని మృతిపై ఆర్సీవో విచారణ

జహీరాబాద్, జనవరి 8: జహీరాబాద్ పట్టణంలోని రంజోల్ గ్రామంలోని సాంఘీక సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతున్న బేగరి స్వప్న ఆదివారం ఆత్మహత్యకు పాల్పడగా ఆమె మృతిపై మెదక్ రీజీయన్ ఆర్సీవో భీమయ్య సోమవారం విచారణ చేపట్టారు. అందులో భాగంగా ఆయన కళాశాలకు చేరుకుని విద్యార్థిని మృతిపై ఆరాతీసి, తోటి విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి సమాచారం సేకరించారు. సుమారు రెండుగంటల పాటు మృతిచెందిన విద్యార్థిని స్వప్నకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించారు. సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన తెలిపారు.

కొత్తపల్లి సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

పాపన్నపేట, జనవరి 8: కొత్తపల్లి సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేస్తూ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఉత్తర్వులు జారీ చేశారు. ఉప సర్పంచ్ అంజలి ఫిర్యాదు చేయగా, డీఎల్పీవో విచారణ జరిపి ఇచ్చిన రిపోర్టు ఆధారంగా చెక్ పవర్ రద్దు చేసినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉప సర్పంచు సంతకం లేకుండా, మరో గ్రామ పంచాయతీ వార్డు మెంబర్ సంతకం తీసుకుని నిధులు డ్రా చేశారని, గ్రామ సభలు సక్రమంగా నిర్వహించలేదని పేర్కొన్నారు. ఇక ముందు ఎంపీవో, ఉప సర్పంచ్ ఉమ్మడి సంతకాలతో నిధులు డ్రా చేయవచ్చని సూచించారు.

జాతీయ క్రీడలకు పీఈటీ ఎంపిక



రాములు యాదవ్‌కు
పతకాలు, ప్రశంసాపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

కల్హేర్, జనవరి 8: మండల పరిధిలోని క్రిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఈటీ రాములు యాదవ్ 6వ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ గేమ్స్‌లో నాలుగు పతకాలు సాధించి, డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో శనివారం జరిగిన క్రీడల్లో లాంగ్‌జంప్, 400 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలు, 100, 200 మీటర్ల పరుగు పందెంలో రజత పతకాలు సాధించాడు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాములు యాదవ్‌ను కల్హేర్ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, క్రిష్టాపూర్ సర్పంచ్ కిష్టారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం రాంమోహన్‌రావ్ అభినందించారు.

అంతర్‌రాష్ట్ర షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రథమ బహుమతి



ప్రథమ బహుమతి అందుకుంటున్న షటిల్ టోర్నీ విజేతలు

నారాయణఖేడ్,జనవరి 8: కామారెడ్డి జిల్లా బీచ్కుంద మండలం మిషన్ కలాలి గ్రామంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన అంతర్‌రాష్ట్ర ఓపెన్ టూ ఆల్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు. మహారాష్ట్రలోని డెగ్లూరు టీంతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఖేడ్‌బుల్స్ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ క్రీడాకారులు రవిగౌడ్, ఖలీల్ ప్రథమ బహుమతిని సాధించారు. అసోసియేషన్‌కే చెందిన రెండో జట్టులోని రిత్విజ్, గంభీర్ సెమీఫైనల్స్‌లో ఓడినా రిత్విజ్ ఎమర్జింగ్ ప్లేయర్ అవార్డును దక్కించుకున్నాడు. వారిని అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్‌సాజిద్, ప్రధాన కార్యదర్శి రవికుమార్‌తో పాటు ఇతర బాధ్యులు భూమయ్య, ప్రవీణ్, మారుతి, దేవీసింగ్, తదితరులు అభినందించారు.

జిల్లాల పునర్విభజనతో లాభపడింది కేసీఆర్ కుటుంబమే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

మెదక్, జనవరి 8: కేసీఆర్ ప్రభుత్వం 33 జిల్లాలను ఏర్పాటు చేయడం ద్వారా వారి కుటుంబం మాత్రమే లబ్ధి పొందిందని, అశాస్త్రీయ పద్ధతిలో జిల్లాల పునర్విభజన చేయడంతో ప్రభుత్వంపై భారీగా ఆర్థిక భారం పడిందని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు బాల్‌రాజ్ ఆరోపించారు. సోమవారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో మాట్లాడుతూ ప్రభుత్వాధికారులు వేతనాలు పొందుతూ సామాన్య, నిరుపేదలకు అందుబాటులో ఉండడం లేదని ఆరోపించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు అణగారిన వర్గాల పక్షాన నిలిచి సామాజిక న్యాయం దిశగా అడుగులు వేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో 33 జిల్లాలను కుదించే దిశగా కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నేతలు రవి, సంజీవులు, సిద్దిరాములు, నర్సింలు, ప్రవీణ్, ప్రభాకర్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక


బద్రుద్దీన్


వెంకటేశ్వర్ రాజు

కోహీర్ జనవరి 8: టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం కోహీర్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నామని ఆ కమిటీ జిల్లా కార్యదర్శి హైమద్ హసీబోద్దీన్ తెలిపారు. సోమవారం కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్ ఆధ్వర్యంలో ఆ కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ అధ్యక్షుడిగా మొహమ్మద్ బద్రుద్దీన్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్‌రాజు, ఉపాధ్యక్షులుగా ప్రసన్న, సయ్యద్ జహంగీర్, కోశాధికారిగా జనార్దన్, మండల కార్యదర్శులుగా రాము, రజియోద్దీన్, నందిని, పూజిత, పుష్పమ్మ ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా బలరామ్, సభ్యులుగా హామెద్‌బిన్ సయ్యద్, శంషాద్ బేగం, మీనాక్షి, ముకుంద్, శిల్పలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం ఈసారైనా విద్యారంగాన్ని మెరుగుపరిచి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. అలాగే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను ఇవ్వాలన్నారు.

ఒరిజినల్ గుర్తింపు కార్డులను చూపించాలి

జహీరాబాద్, జనవరి 8: మహాలక్ష్మీ పథకంలో భాగంగా బస్సుల్లో ప్రయాణించే ప్రతీ మహిళా ఒర్జినల్ గుర్తింపు కార్డులను వెంట తెచ్చుకోవాలని జహీరాబాద్ డిపో మేనేజర్ సూర్యనారాయణ తెలిపారు. మహిళలు గుర్తింపు కార్డులను మొబైల్‌ఫోన్‌లో ఉన్నాయంటూ కండక్టర్లకు చూయిస్తున్నారని, అందులో ఫొటో, వివరాలు స్పష్టంగా ఉండకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహిళాప్రయాణీకులు ఓరిజినల్ గుర్తింపుకార్డులను చూయించి జీరోటికెట్ విధిగా తీసుకోవాలన్నారు. మహాలక్ష్మీ పథకం తెలంగాణ రాష్ట్ర మహిళలకే వర్తిస్తుందని, ఇతరత్ర రాష్ట్రాలకు చెందిన మహిళలు వర్తించదన్నారు.

ఆస్తి లాక్కుని.. అన్నం పెట్టడం లేదు

● ఆర్డీవోకు విన్నవించిన వృద్ధ దంపతులు

నారాయణఖేడ్, జనవరి 8: తమ పేరిట ఉన్న భూమిని నలుగురు కుమారులు వారి పేర్లపైకి మార్చుకుని పట్టెడన్నం పెట్టడం లేదని వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై ఖేడ్ ఆర్డీవో వెంకటేష్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం మాద్వార్ పోతన్‌పల్లి గ్రామానికి చెందిన దాడి బాగయ్యకు నలుగురు కుమారులు ఉన్నారు. తన పేరిట ఉన్న 8 ఎకరాల భూమిని నలుగురికి సమానంగా రాసి ఇచ్చాడు. అయితే భూమి రాయించుకున్న అనంతరం వృద్ధాప్యంలో ఉన్న తమకు కొడుకులు, కోడళ్లు అన్నం పెట్టడం లేదని వాపోయారు. అందువల్ల తమకు న్యాయం చేయాలని ఆ వృద్ధ దంపతులు ఆర్డీవోను కోరారు. దీంతో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో వారికి హామీఇచ్చారు.


ఖేడ్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న వృద్ధ దంపతులు

మల్లన్న భక్తురాలి 10 తులాల బంగారు గొలుసు అపహరణ

చేర్యాల, జనవరి 8: కొమురవెల్లి మల్లికార్జునస్వామి దర్శనార్థం వచ్చిన ఓ మహిళ మెడలో నుంచి పది తులాల బంగారం గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. హైదరాబాద్ కొంపల్లికి చెందిన ఆండాలు మల్లన్న కల్యాణం సందర్భంగా ఆదివారం కుటుంబసమేతంగా కొమురవెల్లికి చేరుకున్నారు. గంగిరేగుచెట్టు ప్రాంగణంలో గుర్తుతెలియని వ్యక్తులు బంగారు గొలుసు అపహరించడంతో ఆందోళనకు గురైంది. ఈ విషయమై సోమవారం కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ నాగరాజు దర్యాప్తు చేపట్టారు. ఆలయంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా.. ఆండాలును పలువురు మహిళలు చుట్టుముట్టి అనుమానాస్పదంగా కనిపించడాన్ని గుర్తించారు. ఇదిలా ఉండగా జాతర సమయంలో గంగిరేగుచెట్టు ప్రాంగణంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. భక్తులు చెట్టు చుట్టూ ప్రదక్షిణ చేయడంతో పాటు ముడుపులు కట్టే క్రమంలో దొంగలు మహిళల ఆభరణాలు, పురుషుల పర్సులు అపహరిస్తున్నారు. కల్యాణం రోజునే పలువురి మహిళల బంగారు గొలుసులు కొట్టేయగా, మరో మూడునెలలపాటు ఉత్సవాలు జరగనున్నందున దొంగతనాల నివారణకు పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భూమి విక్రయిస్తామని డబ్బులు తీసుకుని మోసం

● ముగ్గురిపై కేసు నమోదు

కల్హేర్, జనవరి 8: భూమి విక్రయిస్తామని చెప్పి రూ.20 లక్షలు బయానా తీసుకుని రిజిస్ట్రేషన్ చేయకుండా మోసానికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు కల్హేర్ ఎస్ఐ వెంకటేశం సోమవారం తెలిపారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండల పరిధిలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన వడిత్యా దిలీప్ కల్హేర్ మండల పరిధిలోని క్రిష్ణాపూర్ గ్రామానికి చెందిన ముల్కి పేతురు అనే వ్యక్తికి చెందిన 68అ, 69అ1, 69/ఆ/2 సర్వే నంబర్లలోని 3 ఎకరాల రెండు గుంటల భూమిని రూ.36.60 లక్షలకు కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ మేరకు వడిత్యా దిలీప్ తన భార్య వడిత్యా దేవి పేరున 2023 మే 29న ఒప్పంద పత్రం రాయించుకుని రూ.20 లక్షలు అడ్వాన్స్ కింద పేతురుతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు నాగ్‌ధర్‌కు చెందిన సుధాకర్, కంగ్టికి చెందిన శివకు అందజేశారు. భూమి రిజిస్ట్రేషన్ చేయాలని వడిత్యా దిలీప్ ఎన్నిసార్లు పేతురును కోరినా ఆయన రిజిస్ట్రేషన్ చేయలేదు. తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగడంతో ఈ ముగ్గురు వ్యక్తులు చెక్కులు ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. డబ్బులు డ్రా చేసుకునేందుకు బ్యాంకుకు వెళ్లగా వారి ఖాతాల్లో డబ్బులు లేకపోవడంతో పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. దీంతో రూ.4.50 లక్షలు తిరిగిఇవ్వగా మిగతా రూ.15.50 లక్షలు ఇవ్వకుండా బాధితులను బెదిరించడంతో వారు 3న కల్హేర్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో పేతురుతో పాటు ఆయనకు సహకరించిన సుధాకర్, శివపై 420, 406, 506 రెడ్ విత్ 34 ఐపీసీ సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశం తెలిపారు.

బయోమైనింగ్ చేసినా ఫలితమేదీ?

● గుట్టలుగా పేరుకుపోతున్న చెత్తకుప్ప
● తడి, పొడి చెత్తను వేరుచేయకుండానే డంపింగ్‌యార్డులో పారబోత
● అధికారుల పర్యవేక్షణా లోపం.. సిబ్బంది నిర్లక్ష్యం


డంపింగ్‌యార్డులోని బయోమైనింగ్ మెషీన్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 8: రాష్ట్రవ్యాప్తంగా డంపింగ్‌యార్డులను శుభ్రం చేసేందుకు ప్రభుత్వం బయోమైనింగ్ విధానానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మెదక్ మున్సిపాలిటీలోనూ చేపట్టారు. 9 నెలలుగా ఈ ప్రాజెక్టులో భాగంగా గుట్టలుగుట్టలుగా పేరుకుపోయిన తడి, పొడి చెత్తను శుభ్రం చేసే పని ప్రారంభించారు. ఈ విధానం ద్వారా ప్లాస్టిక్, ఇతర వస్తువులను వేరుచేయడంతో పాటు తడి చెత్తను వర్మీకంపోస్ట్‌గా మారుస్తున్నారు. ఓవైపు డంపింగ్‌యార్డును పూర్తిగా జల్లెడ పడుతుంటే, మరోవైపు మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తడి, పొడి చెత్త గుట్టలు పేరుకుపోతున్నాయి. అసలు సిబ్బంది తడి, పొడి చెత్తను వేరుచేయకుండానే డంపింగ్‌యార్డులో పారబోస్తున్నారు.

మెదక్ మున్సిపాలిటీ పరిధిలో 32 వార్డులు ఉండగా ప్రతీరోజు 20 టన్నుల వరకు తడి, పొడి చెత్త వస్తున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్ తెలిపారు. ఇందులో తడి చెత్త 5 టన్నులు, పొడి చెత్త 10 టన్నులు, రెండూ కలిపి 2 టన్నులకుపైగా వస్తున్నది. అయితే ఇంటివద్దే తడి, పొడి చెత్తలను వేరు చేసి స్వీకరించాలని ఆదేశిస్తున్నా ఏమాత్రం అమలు కావడం లేదు. ఇప్పటికే బయోమైనింగ్ ద్వారా 80 శాతం చెత్తను వేరుచేసి వర్మీకంపోస్టుతో పాటు ప్లాస్టిక్ కవర్లను వేరు చేశారు. కానీ చెత్తసేకరణలో క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడం కారణంగా తడి, పొడి చెత్తను కలిపి సిబ్బంది సేకరిస్తున్నారు. దీంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. డంపింగ్‌యార్డులో ప్లాస్టిక్ కవర్లతో కూడిన చెత్తకుప్పలు గుట్టలుగుట్టలుగా దర్శనమిస్తున్నాయి.

చెత్తబుట్టలను అడుగుతున్నారు

తడి, పొడి చెత్త వేరు చేసే విధానంలో క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరును పరిశీలిస్తున్నాం. వేరు చేసి ఇవ్వాలని సూచిస్తే చెత్త డబ్బాలను అడుగుతున్నారు. గతంలో తడి, పొడి వేరుచేసి ఇవ్వడానికి చెత్త డబ్బాలను పాలకవర్గం అందజేసింది. అయినప్పటికీ తిరిగి అడుగుతున్నారు. ఈ విషయాన్ని పాలకవర్గం దృష్టికి తీసుకెళ్తాం.

- మహేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, మెదక్



వేరు చేసిన ప్లాస్టిక్ కవర్ల కుప్పలు, డంపింగ్‌యార్డులో వేరు చేయకుండా వేసిన తడి, పొడి చెత్తకుప్పలు

'ప్రజావాణి' ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

● అధికారులకు మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశం
● మెదక్ జిల్లాలో 82 అర్జీల స్వీకరణ.. తక్షణ పరిష్కారానికి చర్యలు


ప్రజావాణిలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ అర్బన్, జనవరి 8: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణిని నిర్వహిస్తున్నామని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. సోమవారం ప్రజావాణి హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని మారుమూల గ్రామాల ప్రజల నుంచి 82 అర్జీలను కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు స్వీకరించారు. ఇందులో భూ సమస్యలు, ఉద్యోగం, ఉపాధి తదితర ఫిర్యాదులకు సంబంధించినవి ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వీకరించిన దరఖాస్తులను వెంటనే సంబంధిత శాఖాధికారులకు అందజేసి పరిష్కరించాల్సిందిగా ఆదేశిస్తున్నామన్నారు. నిర్ణీత సమయంలోగా దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఆర్వో పద్మశ్రీతోపాటు వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాయలంలో ప్రజావాణిలో భాగంగా దరఖాస్తులను స్వీరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి పలు ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు

సమస్యలను పరిష్కరించేందుకే 'ప్రజావాణి'

సంగారెడ్డి రూరల్, జనవరి 8: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మాధురి అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్వో నగేష్‌గౌడ్‌లు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే అర్జీలను ఆయాశాఖల అధికారులు పరిశీలించిన వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఒకవేళ సమస్య పరిష్కారం కాకపోతే దానికి గల కారణాలను అర్జీదారులకు వివరంగా తెలపాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మనూర్ మండల కేంద్రానికి ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని ఆ గ్రామ యువకులు అర్జీలో కోరారు. తమకు సంబంధించిన భూమి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, తమకు పింఛన్లు ఇప్పించాలని, ఉపాధి చూపాలని కోరుతూ మొత్తం 72 మంది అర్జీలు అందజేశారు. అర్జీలను పరిశీలించిన అదనపు కలెక్టర్ మాధురి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆయాశాఖలకు సంబంధించిన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో పరమేశ్వర్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 8: ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అధికారులను అదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆమె దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని సూచించారు. కాగా ప్రజావాణికి భూ సంబంధిత, ఆసరా పింఛన్లు ఇతరత్రా మొత్తం 24 దరఖాస్తులు వచ్చాయని ఆమె చెప్పారు. డీఆర్వో నాగ రాజమ్మ, డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

నారాయణఖేడ్, జనవరి 8: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతిచెందింది. నారాయణఖేడ్ పట్టణానికి చెందిన ఏఐఎంఐఎం అధ్యక్షుడు సయ్యద్ యూనుస్‌కు ఇద్దరు భార్యలు. మొదటి భార్య ఇత్వార్ పేటలోని సొంత ఇంట్లో ఉంటుంది. రెండో భార్య ఆసియాఅంజుమ్‌బేగం(35) పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో అద్దె ఇంట్లో ఉంటుంది. ఆసియా బేగంకు ఒక కుమార్తె ఉన్నది. సయ్యద్ యూనుస్ సోమవారం ఉదయం బయటకు వెళ్లాడు. రోజులాగే సాయంత్రం కూతురిని పాఠశాల నుంచి తీసుకొచ్చే ముందు అంజుమ్‌కు ఫోన్‌చేయగా లిఫ్ట్ చేయలేదు. ఇంటికి వెళ్లి చూడగా వంట గదిలో అచేతనంగా పడి ఉన్నది. వెంటనే ఖేడ్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అక్కడ పరిశీలించిన వైద్యులు మృతిచెందిందని నిర్ధారించారు. స్థానిక డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి భర్తతో పాటు వైద్యులను వివరాలు అడిగి తెలుసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి


వెంకటేష్(ఫైల్)

నారాయణఖేడ్, జనవరి 8: గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందాడు. మండల పరిధిలోని తుర్కపల్లికి చెందిన దిడ్డి వెంకటేష్(30) నారాయణఖేడ్ పట్టణంలోని వెంకటేశ్వర షాపింగ్ మాల్‌లో పనిచేస్తాడు. రోజులాగే ఆదివారం విధులు ముగించుకుని తన వాహనంపై తుర్కపల్లికి వెళ్తున్నాడు. నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటేష్ మృతదేహాన్ని నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నారాయణఖేడ్ ఎస్-2 శ్రీనివాస్ తెలిపారు. మృతుడికి ఇరువురు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

● రూ.47 వేల నగదు, 4 కార్లు, 2 బైకులు, 6 సెల్‌ఫోన్లు సీజ్

నాగల్‌గిద్ద, జనవరి 8: కర్నాటక సరిహద్దులోని సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం చౌక్లానాయక్‌తండాలో పేకాట స్థావరంపై సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ ఆదేశాల మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం దాడిచేసి ఆరుగురిని అరెస్ట్ చేశారు. నాగల్‌గిద్ద ఎస్ఐ సిద్ధిరాములు తెలిపిన వివరాల ప్రకారం.. చౌక్లానాయక్‌తండాలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ బృందం దాడిచేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. కాగా వీరికి సంబంధించిన ఎర్టిగా, స్కోడా, ఇటోస్, షిఫ్ట్ కార్లతో పాటు హోండాషైన్, గ్లామర్ బైకులతో పాటు రూ.47,330 వేల నగదును సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేలిన మొబైల్, క్రషర్ కార్మికుడికి తీవ్రగాయాలు

తూప్రాన్, జనవరి 8: కంకర క్రషర్లలో పనిచేసే ఓ కార్మికుడి మొబైల్ ఫోన్ పేలిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఘనపూర్ శివారులోని శివం శంకరం స్టోన్ క్రషర్ కంకర మిషన్ వద్ద మహారాష్ట్రకు చెందిన సునీల్(35) బ్లాస్టింగ్ పనులు నిర్వహిస్తుంటాడు. సోమవారం రాత్రి మొబైల్ ఫోన్ పేలిపోవడంతో సునీల్ తీవ్రంగా గాయపడినట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో సునీల్ పొట్ట భాగం నుంచి పేగులు బయటపడ్డాయి. వెంటనే అతడిని హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా.. ప్రమాదంపై గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న తూప్రాన్ ఎస్ఐ శివానందం ప్రమాదస్థలానికి వెళ్తున్నట్టు తెలిపారు.

సంగారెడ్డిలో అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం

● యూటర్న్ చేస్తుండగా ఢీకొన్న కార్లు ● సీసీటీవీల్లో దృశ్యాలు వైరల్


సీసీటీవీల్లో రికార్డైన ప్రమాద దృశ్యం

సంగారెడ్డి క్రైం, జనవరి 8: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి తర్వాత రెండు కార్లు ఢీకొన్నాయి. పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తి కరుణ స్కూల్ వద్ద రోడ్డు యూటర్న్ చేస్తున్నాడు. సంగారెడ్డి మండలం తాళ్లపల్లికి చెందిన మరో వ్యక్తి తన కారులో పోతిరెడ్డిపల్లి చౌరస్తా వైపు వెళ్తూ యూటర్న్ చేస్తున్న కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. కాగా అర్ధరాత్రి సమయంలో రెండు కార్లు ఢీకొన్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పట్టణ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

నాచగిరి క్షేత్రాన్ని సందర్శించిన సత్యాత్మతీర్థ శ్రీపాదులవారు

● పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ నిర్వాహకులు



సత్యాత్మతీర్థ శ్రీపాదులవారికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

వర్గల్, జనవరి 8: వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహుడి క్షేత్రాన్ని సోమవారం జగద్గురువులు శ్రీఉత్తరాది మఠాధిపతి శ్రీ సత్యాత్మతీర్థ శ్రీపాదులవారు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులతో పాటు శ్రీ రాఘవేంద్ర బృందవనం ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ బస్టాండ్‌ను పరిశీలించిన అధికారులు

హుస్నాబాద్, జనవరి 8: హుస్నాబాద్‌లోని బస్టాండ్‌ను సోమవారం ఆర్టీసీ ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండ్‌ను ఆధునీకరించేందుకు వారు బస్టాండ్‌ను సందర్శించారు. ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు బస్టాండ్‌లో అవసరమైన సౌకర్యాలను గురించి వివరించారు. మరో రెండు నుంచి మూడు ఫ్లాట్ ఫామ్‌లు పెంచాలని, అదనంగా మహిళల మూత్ర శాలలు నిర్మాణం చేయాలని, బస్సులు బయటకు వెళ్లే ప్రాంతంలో ఉండే పాత బిల్డింగ్‌ను తీసేసి, అక్కడ కూడా టాయ్‌లెట్స్ నిర్మాణం చేయాలని డీఎం వారికి వివరించారు. ఇందులో ఆర్టీసీ సీఇ శ్రీనివాస్‌తో పాటు ఇఇ, డీఇ ఇతర ఇంజనీరింగ్ అధికారులున్నారు.

సిద్దిపేట- హుస్నాబాద్ ఫోర్ లైన్ రోడ్డు.. పనుల జాప్యంతో తీవ్ర ఇక్కట్లు

● మిట్టపల్లి నుంచి ముండ్రాయి వరకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ● రోడ్డును ఒకేసారి ఇరువైపులా తవ్వేయడంతో ఇబ్బందులు



మిట్టపల్లి సమీపంలో కంకరవేసిన రోడ్డుపై నుంచే వెళ్తున్న వాహనాలు, వాహనాలు వెళ్తుండగా రోడ్డుపై లేచిన దుమ్ము, ధూళి

సిద్దిపేట అర్బన్, జనవరి 8: సిద్దిపేట నుంచి హుస్నాబాద్ వరకు నిర్మించే ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి నుంచి ముండ్రాయి వరకు జరుగుతున్న పనుల్లో జాప్యం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనాల రాకపోకల సమయంలో పైకి లేచే దుమ్ము, ధూళి వల్ల వాహనదారులకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రెండువైపులా ఒకేసారి తవ్వేశారు

రోడ్డును ఒక పక్కన తవ్వి, అక్కడ పనులు పూర్తయిన తర్వాత మరోపక్క ప్రారంభించాల్సి ఉండగా, కాంట్రాక్టర్ ఒకేసారి రెండు వైపులా రోడ్డును తవ్వేసి మరమ్మతులు చేపట్టాడు. అంతే కాకుండా పనుల్లో జాప్యం కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం జరుగుతుందని వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పనులు త్వరగా పూర్తి చేస్తే ప్రయాణానికి ఇబ్బంది ఉండదని, అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రోడ్డు పొడవునా కంకర వేసి వదిలివేయడంతో వాహనాలకు ఇబ్బందులు కలగడంతో పాటు పెద్ద ఎత్తున దుమ్ము లేవడంతో ముందు వెళ్లే వాహనాలు వెనుక వచ్చే వాహనాలు కనబడక ప్రమాదం జరిగే అవకాశాలు కూడా ఉన్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులోకి రాని అధికారులు

ఈ విషయమై స్థానిక ఆర్ అండ్ బీ అధికారులను సోమవారం సంప్రదించగా ఫోర్‌వే రోడ్డు పనులు నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో జరుగుతున్నాయని, తమకు సంబంధం ఉండదని తెలిపారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు. కాగా పనులు జరుగుతున్న ప్రదేశంలో ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, దుమ్ము ధూళి లేవకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డుపై ప్రయాణం ఇబ్బందిగా ఉంది

మేము మిట్టపల్లి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివాసముంటున్నాం. సిద్దిపేట నుంచి అక్కడికి వెళ్లాలంటే ఇదే రోడ్డుపై వెళ్లాల్సి ఉంటుంది. రోజువారీగా ప్రయాణించే మాకు ఈ రోడ్డుపై వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. రోడ్డుపై అడ్డదిడ్డంగా కంకర వేయడం వలన వాహనాల టైర్లు పాడైపోయి, దుమ్ము, ధూళి లేవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడకపోవడం వలన ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

\- నవీన్, వాహనదారుడు

పనులు త్వరగా పూర్తి చేయాలి

ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణం పనులు తొందరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకొని ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. పనులు నత్త నడకన సాగడంతో రోజూ ఈ రోడ్డుపై వెళ్లడం తలనొప్పిగా మారింది. ఒకపక్క రోడ్డు నిర్మాణం అయిన తర్వాత మరోపక్క చేపడితే బాగుండేది. రెండు వైపులా నిర్మాణం పనులు ఒకేసారి చేపట్టడం వలన ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

\- రంజిత్, మిట్టపల్లి

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర జిల్లా నోడల్ అధికారి



కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గజ్వేల్, జనవరి 8: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట జిల్లా భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర ప్రత్యేక అధికారి సురేంద్ర సింగ్ సూచించారు. గజ్వేల్ మండల పరిధిలోని బెజుగామ గ్రామంలో భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పథకాలను గూర్చి జిల్లా వ్యవసాయాధికారి డి.శివప్రసాద్, జిల్లా వైద్యాధికారి జూలూరి కాశీనాథ్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి తనూజలు ప్రజలకు వివరించారు. బ్యాంకింగ్ రంగంలో తీసుకువచ్చిన పలు అంశాలపై గజ్వేల్ ఎస్‌బీఐ ఏడీబీ మేనేజర్ సుజాత ప్రజలకు వివరించారు. ముఖ్యంగా ముద్ర లోన్లు, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమాయోజన, ఆయా రకాల లోన్లను గూర్చి, పథకాలను గూర్చి తెలిపారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి సురేంద్ర సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆయుష్మాన్ భారత్, ముద్రా లోన్లు, ఫసల్ బీమా యోజన పథకాలను గత ప్రభుత్వం అమలు చేయలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఈ పథకాలతో ప్రజలు ఎంతగానో లబ్ధి పొందుతారని, ప్రజలకు అన్ని పథకాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ఆయన వెంట బీజేపీ సీనియర్ నాయకులు యెల్లు రాంరెడ్డి, కుడిక్యాల రాములు, మహేశ్, శేషమా ఇండేన్ గ్యాస్ నిర్వాహకులు, సిబ్బంది ఉన్నారు.

దుబ్బాక ఎమ్మెల్యేను సన్మానించిన గజ్వేల్ జడ్పీటీసీ

గజ్వేల్, జనవరి 8: దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని గజ్వేల్ జడ్పీటీసీ పంగ మల్లేశం ఘనంగా సత్కరించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి భారీ చిత్రాన్ని అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



ఓబులాపూర్‌లో మృతుడి కుటుంబీకులను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చిన్నకోడూరు, జనవరి 8: మండలంలోని మాచాపూర్ గ్రామానికి చెందిన సుంచు బాబు (36), ఓబులాపూర్ బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ముచ్చర్ల సతీష్ తండ్రి భూపతి (72), శంకరాయకుంటకు చెందిన వార్డు సభ్యుడు నగరం రాజు తండ్రి మల్లయ్య (68) ఇటీవల మృతి చెందారు. సోమవారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కామిని శ్రీనివాస్, ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ కొండం రవీందర్ రెడ్డి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బాబు, ఐలయ్య, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలలో దరఖాస్తులు ఆహ్వానం

వెల్దుర్తి, జనవరి 8: మండల కేంద్రమైన వెల్దుర్తిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో నైట్‌వాచ్ వుమెన్, హెడ్ కుక్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పాఠశాల ఎస్‌వో ఫాతిమా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి 18వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పదోతరగతి మెమో, ఆధార్ కార్డు జత చేసి దరఖాస్తు చేసుకోవాలని, హెడ్‌కుక్ పెద్ద మొత్తంలో వంట చేసే అనుభవం తప్పనిసరిగా ఉండాలని ప్రకటనలో పేర్కొన్నారు.

బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి: సీడీపీవో

చిన్నశంకరంపేట, జనవరి 8: బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో స్వరూప సూచించారు. సోమవారం చిన్నశంకరంపేట మండలంలోని జంగరాయి తండా అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రసన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ పిల్లల ఎదుగుదల కోసం బాలింతలు, గర్భిణులు పోషక విలువలు కలిగిన అహారాన్ని తీసుకోవాలన్నారు. ఎక్కువ గుడ్లు, ఆకు కూరలు, పిండి పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య చిట్కాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త ఇందిరా, సరోజ, పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠాపన



కరస్‌గుత్తిలో విగ్రహ ప్రతిష్ఠాపన చేసిన దృశ్యం

నాగల్‌గిద్ద, జనవరి 8: మండలపరిధిలోనికరస్‌గుత్తి గ్రామంలో సోమవారం సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారీకార్ భజన బృందం ఆధ్వర్యంలో గ్రామంలో వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించడంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠాపన చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

చేర్యాల రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ ఛైర్మన్ భైరవభట్ల చక్రధర్

చేర్యాల, జనవరి 8: చేర్యాల రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయాలని జేఏసీ ఛైర్మన్ భైరవభట్ల చక్రధర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని షాదీఖానాలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు చేర్యాల డివిజన్ ఏర్పాటు పట్ల ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా చర్యలు తీసుకోకపోవడం తగదన్నారు. చేర్యాల ప్రజల ఆత్మగౌరవాన్ని వ్యక్తిగత రాజకీయస్వార్థం కోసం కించపరచకూడదన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చేర్యాల ప్రజలకు చేసిన వాగ్దానం మేరకు డివిజన్ జీవో తీసుకువచ్చి చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు.

లేనిపక్షంలో ప్రజల చేతిలో గుణపాఠం తప్పదన్నారు. సమావేశంలో జేఏసీ నాయకులు అందె బీరయ్య, బూరుగు సురేశ్, అంకుగారి శశిధర్‌రెడ్డి, తోకల ఉమారాణి, బూర్గోజు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో పని చేయాలి



కోహెడలో బీజేపీ నాయకులతో పార్లమెంట్ ఎన్నికల ప్రభారీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎనగందుల సందీప్

కోహెడ, జనవరి 8: కోహెడలో బీజేపీ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని పార్టీ మండలాధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్లమెంట్ ఎన్నికల ప్రభారీ, బీజేపీ రాష్ట్ర నాయకులు ఎనగందుల సందీప్ హాజరై మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులు ప్రజల మధ్యనే ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పని చేస్తేనే పార్టీ బలోపేతం అవుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల కొరకు ఆయా గ్రామాల్లో బూత్ అధ్యక్షులకు దిశా నిర్దేశం చేశారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా వచ్చే మూడు నెలల పాటు కష్టపడి పని చేయాలని కోరారు. ఫిబ్రవరి నుంచి కోహెడలోనే ఉండి ఒక కార్యకర్తగా మీతో కలిసి నేను కూడా పనిచేస్తానని సందీప్ అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ఇన్‌చార్జి నరేందర్‌పాల్, పార్టీ శ్రేణులు మ్యాకాల చంద్రశేఖర్ రెడ్డి, జాలిగం రమేష్, బండ జగన్ యాదవ్, గుగ్గిళ్ల శ్రీనివాస్, మ్యాకాల రజినీకాంత్ రెడ్డి, ఎర్రవెల్లి హరిదాస్, దాసరి వెంకటేష్, గాజుల వెంకటేశ్వర్లు, పేర్యాల సాగర్‌రావు, వేముల రమేష్, మామిడి కరుణాకర్ గౌడ్, రాంచంద్రారెడ్డి, కంది సత్యనారాయణ రెడ్డి, దావా శేఖర్, కిష్టారెడ్డి, నవీన్ చారి, చంద్రం, రమేష్, మారుపాక రాజు, రాములు, తలారి సుధాకర్, బండ సుమన్ తదితరులున్నారు.

జగదేవ్‌పూర్‌లో పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

జగదేవ్‌పూర్, జనవరి 8: పీఆర్టీయూ క్యాలెండర్‌ను సోమవారం జగదేవ్‌పూర్‌లో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించడంలో పీఆర్టీయూ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నాయక్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పీఆర్టీయూ నాయకులు

మద్దూరు మండల జేఏసీ కో కన్వీనర్‌గా ఉదయ్‌రెడ్డి



మద్దూరు, జనవరి 8: మద్దూరు మండల జేఏసీ కో కన్వీనర్‌గా గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన మోకు ఉదయ్‌రెడ్డిని సోమవారం చేర్యాల డివిజన్ ఛైర్మన్ భైరవభట్ల చక్రధర్ నియామకం చేశారు. ఈ మేరకు ఉదయ్‌రెడ్డి మాట్లాడారు. చేర్యాల డివిజన్ సమస్యలపై కొనసాగుతున్న ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ముందుంటానన్నారు. తన నియామకానికి సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పాకాల ఇసాక్ ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ తెలంగాణ ఉపాధ్యక్షుడిగా భూపాల్



మిరుదొడ్డి, జనవరి 8: ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని కాసులాబాద్ గ్రామానికి చెందిన ముత్యాల భూపాల్‌ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తన ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి హామీ కూలీలకు ఆధార్ అనుసంధానాన్ని ఉపసంహరించుకోవాలి



చౌదరిపల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న బ్యాగరి వేణు

వర్గల్, జనవరి 8: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు శాపంగా మారిన ఆధార్ అనుసంధానాన్ని ఉపసంహరించుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో ఉపాధి హామి పథకంలో పని చేసే కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండుసార్లు ఫొటో పద్ధతి, ఆధార్ అనుసంధానం, అలస్యపు వేతనాలు తదితర సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

రేపు టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీకి సన్మానం

గజ్వేల్, జనవరి 8: ఈ నెల 10వ తేదీన టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన గజ్వేల్‌కు చెందిన ఖాజా విరాహత్ అలీకి గజ్వేల్ జర్నలిస్టు వెల్ఫేర్ సొసైటీ, ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు యెన్నెల్లి సురేందర్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం వారు గజ్వేల్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ పట్టణంలోని మల్లారెడ్డి గార్డెన్స్‌లో బుధవారం సాయంత్రం 6గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, ముఖ్య అతిథిగా కవి, రచయిత జయరాజ్ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

'కొమ్మూరి' ఎంపీ టికెట్ కోరడం విడ్డూరం

● సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆముదాల మల్లారెడ్డి

చేర్యాల, జనవరి 8: నాలుగుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి భువనగిరి ఎంపీ టికెట్ కోరుకోవడం విడ్డూరంగా ఉందని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పేర్కొన్నారు. కొమురవెల్లి మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనగామ నియోజకవర్గ ప్రజలు తిరస్కరించి గుణపాఠం చెప్పినా, ఎంపీ టికెట్ కోసం తహతహలాడుతున్నాడని విమర్శించారు. ప్రజాసమస్యలు గాలికి వదిలేసిన కొమ్మూరి ప్రజాసేవకు పనికిరాడని, ప్రజలకు సీపీఎం మాత్రమే అండదండగా నిలిచిందన్నారు. సమావేశంలో నాయకులు అత్తిని శారద, దాసరి ప్రశాంత్, తాడూరి మల్లేశం, తేలు ఇస్తారి, ఆరుట్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రకు రామంచ పాఠశాల విద్యార్థులు



శ్రీలక్ష్మీరంగనాయకస్వామి గుట్టపై రామంచ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిన్నకోడూరు, జనవరి 8: మండలంలోని రామంచ ప్రాథమిక పాఠశాల విద్యార్థులను సోమవారం చంద్లాపూర్ శివారులోని శ్రీలక్ష్మీరంగనాయకస్వామి గుట్ట పైకి విజ్ఞాన విహారయాత్రకు ఉపాధ్యాయులు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగనాయకస్వామిని దర్శించుకొని, ఆటపాటలతో సరదాగా గడిపారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం లక్ష్మయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్లా షరీఫ్, ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, రాములు, సురేష్ కుమార్, సునీత, దేవకి, వాణి తదితరులు పాల్గొన్నారు.

మల్చింగ్ విధానంలో పంటలసాగుతో ప్రయోజనం



జహీరాబాద్: రంజోల్‌లో మల్చింగ్ విధానాన్ని పరిశీలిస్తున్న ఏఈవో ప్రదీప్

జహీరాబాద్, జనవరి 8: మల్చింగ్‌తో పంటలు సాగు చేస్తే రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వ్యవసాశాఖ ఏఈవో ప్రదీప్ పేర్కొన్నారు. సోమవారం రంజోల్ గ్రామంలో మల్చింగ్ విధానంతో వాటర్‌మిలన్ మొక్కలను నాటే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విధానంలో పంటల సాగుకు రైతులు ఆసక్తిని కనబరుస్తున్నారని చెప్పారు. మల్చింగ్ విధానం ద్వారా కలుపు మొక్కల నివారణతో పాటు, భూమిలో తేమ శాతం ఎక్కువగా ఉంటుందన్నారు. కూరగాయలు, వాటర్‌మిలన్, పచ్చిమిర్చి తదితర పంటలకు ఈ విధానాన్ని ఉపయోగించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పంట పొలాలను సందర్శించిన ఏడీఏ

నిజాంపేట: మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో ఏడీఏ వసంత సుగుణ సోమవారం రైతుల పంట పొలాలను పరిశీలించారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఉధృతి అధికంగా ఉన్నందున ఏమమెక్టిన్ బెంజోయేట్ 80 గ్రాముల ద్రావణాన్ని ఎకరం పంటకు పిచికారి చేసుకోవాలని ఆమె సూచించారు. ఆమెవెంట ఏఈవో కావేరి ఉన్నారు.

హుండీ పగులగొట్టి, నగదు అపహరణ

రామాయంపేట, జనవరి 8: పట్టణంలోని మల్లన్న, ఎల్లమ్మ ఆలయాల్లో హుండీలను ధ్వంసం చేసి, నగదును ఎత్తుకెళ్లారు. ఆదివారం అర్ధరాత్రి దుండగులు రెండు హుండీలను పగులగొట్టి దొంగతనానికి ఒడిగట్టారు. సోమవారం ఉదయం ఆలయ కమిటీ సభ్యులు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుండీల్లో దాదాపు రూ.50వేలకు పైగా నగదు చోరీ జరిగినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫిషరీస్ సొసైటీ కన్వీనర్‌గా మహేష్

జిన్నారం, జనవరి 8: సంగారెడ్డి జిల్లా ఫిషరీస్ సొసైటీ కన్వీనర్‌గా ఊట్ల గ్రామానికి చెందిన మహేష్ నియమితులయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఫిషరీస్ సొసైటీ స్థాపన కార్యక్రమంలో జిల్లా కన్వీనర్‌గా మహేష్‌ను నియమించారు. వ్యవస్థాపకుడు పిట్టల రవీందర్, విజయాగుప్తా నియామకపత్రాన్ని అందజేశారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతల పంపిణీ



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఛైర్మన్ రాజమౌళికి అయోధ్య అక్షింతలను అందజేస్తున్న నాయకులు

గజ్వేల్, జనవరి 8: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఛైర్మన్ రాజమౌళికి సోమవారం అయోధ్య అక్షింతలను భక్తులు అందజేశారు. గజ్వేల్ పట్టణంలోని 18వ వార్డులో సోమవారం అయోధ్య అక్షింతల పంపిణీని తోట అమరేందర్‌రావు, సంతోష్ కుమార్, అత్తెల్లి రవీందర్ ప్రారంభించారు. మున్సిపల్ ఛైర్మన్ రాజమౌళి ఇంటికి వెళ్లి ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్య రాముని అక్షింతలు ఇంటింటికీ అందడం పూర్వజన్మ సుకృతమన్నారు. జనవరి 22న రామభక్తులు అంతా భక్తి శ్రద్ధలతో పూజాది కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. వారి వెంట నాయకులు ఎన్‌సీ సంతోష్, విష్ణువర్ధన్‌రెడ్డి, సంపత్‌కుమార్ తదితరులున్నారు.



వర్గల్: నెంటూర్, చాంద్‌ఖాన్ మక్తా గ్రామాల్లో అక్షింతలు పంపిణీ చేస్తున్న గ్రామస్థులు

నెంటూర్, చాంద్‌ఖాన్ మఖ్తా గ్రామాల్లో

వర్గల్, జనవరి 8: వర్గల్ మండల పరిధిలోని నెంటూర్, చాంద్‌ఖాన్ మఖ్తా గ్రామాల్లో సోమవారం అయోధ్య రామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో రామభక్త బృందం ఇంటింటికీ తిరుగుతూ రాములోరి అక్షింతలను పంపిణీ చేశారు. నెంటూర్ గ్రామంలో ఎంపీటీసీ శ్యామల షాదుల్లా, చాంద్‌ఖాన్ మఖ్తా గ్రామాల్లో గ్రామ సర్పంచ్ కనకయ్య ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ రాములోరి అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ములుగు: కొత్తూరులో అయోధ్య అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్న సర్పంచ్ తదితరులు

కొత్తూరులో..

ములుగు, జనవరి 8: ములుగు మండలం కొత్తూరు గ్రామంలో అయోధ్య శ్రీరామ జన్మభూమి అక్షింతలు ఊరేగింపు నిర్వహించారు. గ్రామానికి తీసుకువచ్చిన అక్షింతలు స్థానిక సర్పంచు బాలేష్ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజనలు, కీర్తనలతో ఊరేగింపుగా ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. అక్షింతల పంపిణీ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సర్పంచు బాలేష్ కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు రవి ముదిరాజ్, విష్ణు, మహిళలు పాల్గొన్నారు.